## క్లుప్తంగా

### వేంకటేశ్వరుని ఆదాయం రూ.32.90 లక్షలు



**తెనాలి:** స్థానిక వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో 75 రోజుల కాలపరిమితికి భక్తులు సమర్పించిన కానుకలు, మొక్కుబడుల హుండీల లెక్కింపు నిర్వహించారు. పొన్నూరులోని శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానం కార్యనిర్వహణ అధికారి టి.శ్రీనివాస్ సమక్షంలో హుండీ లెక్కింపు చేశారు. అనంతరం రూ.32,90,502 నగదు, 81.500 గ్రాముల బంగారం, 1,575 గ్రాముల వెండి వచ్చినట్టు వైకుంఠపురం ఆలయ కార్యనిర్వహణాధికారి వి.అనుపమ తెలియజేశారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కుంభం సాయిబాబు, సభ్యులు కనికచర్ల చరణరత్న సందీప్, వంగల జగదీశ్వరి, కురగంటి సునీత -రవిశంకర్, బొద్దులూరి సరస్వతి-నాగేశ్వరరావు, మావులూరి శ్రీనివాస్, ముంతా ప్రసాద్, దేవరకొండ వెంకటరమణ-శంకరరావు, ఎక్స్అఫీషియో సభ్యుడు అళహరి రవి కుమార్, ఏపీసీవో బ్యాంక్, చెంచుపేట సిబ్బంది, భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ వలంటీర్లు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

### బాధ్యతలు స్వీకరించిన మునిసిపల్ డీఈ

**తెనాలిఅర్బన్:** మున్సిపల్ డీఈగా కె.శ్రీనివాసులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన బాపట్ల మున్సిపాలిటీ నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న నాగభూషణం గుంటూరు కార్పొరేషన్ బదిలీపై వెళ్ళిన విషయం తెలిసిందే.

### బీసీజీ వ్యాక్సిన్‌ను వేయించుకోండి



**తెనాలిఅర్బన్:** అర్హులైన ప్రతి ఒక్కరూ బీసీజీ వ్యాక్సిన్‌ను వేయించుకోవాలని తెనాలి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ పల్లెకొండ రవికుమార్ కోరారు. 37వ వార్డులోని వార్డు సచివాలయంలో గురువారం నిర్వహించిన వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాక్సిన్‌పై అపోహలు విడాలన్నారు. బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవడం వలన క్షయను నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

### సబ్సిడీ సరుకుల విక్రయ కేంద్రాల తనిఖీ



**తెనాలిరూరల్:** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రైతు బజార్లలో సబ్సిడీ ధరలకు కంది పప్పు, నూనె విక్రయిస్తున్న స్టాల్స్‌ను తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ గురువారం తనిఖీ చేశారు. ఇక్కడి పాత రత్నాటాకీస్ సమీపంలోని గాంధీ ఇర్విన్ పార్క్ రైతు బజార్‌లో విక్రయాలకు సంబంధించి స్టాల్స్ వద్ద సరుకుల వివరాల ప్రదర్శన, ధరలను తనిఖీ చేశారు. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు, తక్కువ ధరలకు సరుకుల విక్రయాలు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు. ఆయన వెంట సీఎస్ డీటీ మూర్తి, ఎస్టేట్ ఆఫీసర్ మురళి ఉన్నారు.

### మద్యం సీసాల ధ్వంసం



**చందోలు(కర్లపాలెం):** మద్యం అక్రమంగా కలిగి ఉన్నా, విక్రయించినా చట్ట ప్రకారం నేరమని, అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని బాపట్ల డీఎస్పీ జి.రామాంజనేయులు తెలిపారు. చందోలు పోలీసులు 27 కేసుల్లో స్వాధీనం చేసుకున్న 222 మద్యం బాటిళ్లను గురువారం చందోలులో డీఎస్పీ రామాంజనేయులు, రూరల్ సీఐ హరికృష్ణ, స్థానిక రెవెన్యూ అధికారుల సమక్షంలో ఎస్ఐ శ్రీనివాస్ తమ సిబ్బందితో కలసి ధ్వంసం చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ గ్రామాలలో బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించరాదని తెలిపారు.

- బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు, సీఐ హరికృష్ణల పర్యవేక్షణలో గురువారం కర్లపాలెం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ ఎస్ రవీంద్ర తమ సిబ్బందితో కలసి 22కేసుల్లో పట్టుకున్న 208 మద్యం క్వార్టర్ బాటిళ్లను ధ్వంసం చేశారు.

## అందని ద్రాక్షలా మారిన...

# రక్షిత మంచినీరు

- రెండేళ్ల నుంచి నిలచిన కనెక్షన్ల పంపిణీ • నిత్యం లీకులతో అవస్థలు • ఇబ్బందులు పడుతున్న ప్రజలు




కుళాయిలో మంచినీరు పట్టుకుంటున్న వృద్ధురాలు

**తెనాలిఅర్బన్:** రక్షిత మంచినీటి పథకం ద్వారా కృష్ణా జలాలను తెనాలి తీసుకొచ్చి ఏళ్లు గడుస్తున్నా పథకాన్ని ప్రజలకు చేరువ చేయడంలో మున్సిపల్ అధికారులు విఫలమయ్యారు. అమృత పథకం కింద పట్టణ వాసులకు ఉచితంగా కుళాయి కనెక్షన్‌లు ఇవ్వాలని భావించిన అది ఇప్పటికీ సాధ్యపడలేదు. కౌన్సిలర్లు మున్సిపల్ కౌన్సిల్‌లో ఎన్నిసార్లు నిలదీస్తున్నా.... ప్రజా ప్రతినిధులు ఎన్ని సమీక్షలు చేసి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా సదరు ప్రక్రియ మాత్రం ముందుకు సాగటం లేదు. దీంతో ప్రజలు నిరాశ చెందాల్సి వస్తోంది.

తెనాలి పట్టణంలో సుమారు 45 వేలకు పైగా ఇళ్లు ఉన్నాయి. వీటిలో 2.60 లక్షల మంది నివాసం ఉంటున్నారు. పట్టణం విస్తరించటం, భూగర్భ జలాలు అడుగంటి పోతుండటంతో ప్రజల దాహార్తిని తీర్చేందుకు కృష్ణా జలాలను తెనాలి తీసుకువచ్చేందుకు అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి సహకారంతో నాటి పాలకులు కృషి చేశారు. దీనిలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ద్వారా సుమారు రూ.95 కోట్ల నిధులను మంజూరు చేయించారు. దాని కోసం పట్టణంలో ఏడు రిజర్వాయర్లు నిర్మించారు. వీటిలో 30.5 మిలియన్ లీటర్ల నీటిని భద్రపరిచే అవకాశం ఉంది. 2014లో పథకాన్ని అప్పటి శాసన సభాపతి, నేటి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. అనంతరం పట్టణంలో నివశించే ప్రతి ఒక్కరికీ కుళాయి కనెక్షన్ ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నారు.



తెనాలి వీఎస్సార్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి రిజర్వాయర్



కృష్ణా జలాలు శుద్ధి చేస్తోందిలా...

### అమృత పథకం నిధులతో కనెక్షన్లు

రక్షిత మంచినీటి పథకం కుళాయి కనెక్షన్ ఇచ్చేందుకు రూ.8 వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. అంత నగదును ప్రజలు ఇచ్చేందుకు ముందుకు రాకపోవటంతో అప్పటి పాలకులు అమృత పథకం కింద అందరికీ ఉచితంగా కుళాయి కనెక్షన్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగా మొదటి విడత కింద పట్టణంలో 23,370 కుళాయి కనెక్షన్‌లు ఇచ్చేందుకు అమృత పథకం కింద రూ.9.09 కోట్లు మంజూరు చేశారు. హైదరాబాద్‌కు చెందిన భూపాల్ ఇంజినీర్ అండ్ కాంట్రాక్ట్ సంస్థ కుళాయి కనెక్షన్‌లు ఇచ్చే ప్రక్రియ ప్రారంభించింది. కానీ 2018లో గడువు ముగిసిన కనీసం 10 వేల లోపు కనెక్షన్‌ల కూడా ఇవ్వలేకపోయారు. దీంతో ఉన్నతాధికారులు దాని గడువు పొడిగించటంతో ఆప్రక్రియ నేటికీ కొనసాగుతోంది. ఇదిలా ఉంటే తెల్ల రేషన్ కార్డు ఉన్న వారికి రూ.200 చెల్లిస్తే ఉచితంగా కనెక్షన్ ఇచ్చారు.

### సగం ఇళ్లకు కూడా ఇవ్వని కనెక్షన్లు

తెనాలి పట్టణంలో అధికారుల లెక్కల ప్రకారం 45 వేలకు పైగా నివాస గృహాలు ఉన్నాయి. కానీ నేటికీ రక్షిత మంచి నీటి కుళాయి కనెక్షన్‌లు ఇచ్చింది మాత్రం 16,850 మాత్రమే. మిగిలిన ఇళ్లకు కనెక్షన్‌లు ఇవ్వాలని పాలకులు ఆదేశిస్తున్నా అది నేటికీ జరగటం లేదు. రెండు సంవత్సరాలుగా పట్టణంలో ఒక్క కనెక్షన్ ఇవ్వలేదంటే అధికారుల పనితీరు ఎలా ఉందో మనకు అర్థమౌతుంది.

### ఆలస్యం మాట వాస్తవమే



తెనాలి పట్టణంలో రక్షిత మంచినీటి కుళాయి కనెక్షన్‌ల ప్రక్రియ కొంత ఆలస్యంగా జరుగుతున్న మాట వాస్తవం. కొందరు పట్టణ వాసులు వాటిని తీసుకునేందుకు ముందుకు రావటం లేదు. దీంతో కొంత జాప్యం జరుగుతోంది. కనెక్షన్లు కావల్సిన వారు తమను సంప్రదిస్తే వారం లోపు వాటిని ఏర్పాటు చేస్తాం.

–ఆకుల శ్రీనివాసరావు,
ఇన్‌చార్జి మున్సిపల్ ఇంజనీర్, తెనాలి

### నిత్యం లీక్‌లతో వృథాగా పోతున్న కృష్ణా జలాలు

కృష్ణా జలాలను తెనాలిలో సరఫరా చేసేందుకు అన్ని ప్రాంతాల్లో పైప్‌లైన్‌ను ఏర్పాటు చేశారు. వాటిలో తరచూ లీక్‌లు వస్తుండటం వల్ల నీరు వృథాగా పోతోంది. అలాగే ఇళ్లకు ఇచ్చిన కనెక్షన్ల పైపులు సరిగ్గా ఏర్పాటు చేయకపోవటం వాటి నుంచి నీరు వృథాగా పోతోంది. ఇంత జరుగుతున్నా మున్సిపల్ అధికారులు మాత్రం నామమాత్రపు చర్యలతో సరిపెడుతున్నారు. ఇదిలా ఉంటే కుళాయి కనెక్షన్‌ల పైప్‌లైన్‌లు వేసేందుకు రోడ్లన్నీ గుంతలు చేశారు. వాటిని ఇప్పటి వరకు పూడ్చిన దాఖలాలు లేవు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే పట్టణ వాసులందరికీ రక్షిత మంచినీటి పథక కుళాయి కనెక్షన్‌లు ఇస్తే పథకం తెచ్చినందుకు సార్థకత చేకూరినట్లు అవుతుందని చెప్పవచ్చు.

### కాల్వలు పారుదల ఉండే విధంగా చూడండి

అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి



**తెనాలిఅర్బన్:** వర్షాలు పడుతున్న నేపథ్యంలో పంటకాల్వలు, మురుగుకాల్వల్లో పారుదల జరిగే విధంగా చూడాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతి సూచించారు. 24వ వార్డులో గురువారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. వ్యర్థాలు రోడ్లపై ఉండకుండా చూడాలన్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, మున్సిపల్ శానిటరీ సెక్రటరీలు ఉన్నారు.

### మూగజీవాల వ్యాధులపై అవగాహన అవసరం

**కొల్లిపర:** వాతావరణంలో మార్పులు, జోరుగా కురుస్తున్న వర్షాలతో మూగజీవాలను ఆశించే వ్యాధులు, వాటి నివారణపై పాడి రైతులు అవగాహన కలిగి ఉండాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ సాయిసతీష్‌రాజు సూచించారు. గురువారం స్థానిక పశువైద్యశాలలో పాడి రైతులకు వర్షాలు కారణంగా మూగజీవులకు వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల పాక వద్ద మురుగు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని, పశువులు దోమ కాటుకు గురికాకుండా పాకచుట్టూ దోమతెర గుడ్డ వాడాలని సూచించారు. పశువులకు ఆరోగ్య సమస్యలపై ఎటువంటి ఇబ్బంది కరమైన సంఘటనలు జరిగినా పాడి రైతులు సొంత వైద్యం పాటించకుండా దగ్గరలో ఉన్న పశువైద్యులను సంప్రదించి వైద్యుల సలహా మేరకు మందులు వాడాలని కోరారు. మూగజీవాలకు వ్యాపించే సీజనల్ వ్యాధుల రకాలు, నివారణ అన్న అంశాలను వివరించారు.

## వాల్మీకి సేవలు మరువరానివి

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక

**తెనాలిఅర్బన్:** ఆదికవి వాల్మీకి అందించిన సేవలు మరువరానివని మున్సిపల్‌చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక కొనియాడారు. వాల్మీకి జయంతిని మున్సిపల్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోయకులంలో జన్మించిన రత్నాకారుడు వాల్మీకిగా మారి రామాయణ గ్రంథాన్ని రచించారని గుర్తు చేశారు. కుటుంబ జీవన విధానానికి రామాయణం మార్గదర్శకంగా నిలిచిందని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి, మేనేజర్ దేవసేన, ఆర్వో రాంప్రసాద్, టీపీవో సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ రాధిక



వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గంగాయాదవ్

+ వాల్మీకి జయంతిని మార్కెట్‌లోని ఏపీ నవచైతన్య బీసీ సంక్షేమ సేవా సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాల్మీకి రచించిన రామాయణం విశిష్టతను వారు కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు మేడిబోయిన గంగాయాదవ్, నాయకులు కందులు సాంబశివరావు గౌడ్, ఎం.భీష్మపాములు, తాడిబోయిన ప్రవీణ్‌కుమార్, సీహెచ్.శ్రీనివాసరావు, బి.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

### రామాయణ ఘట్టాల చిత్రీకరణ



తన్నీరు విష్ణువర్ధన్

**తెనాలి:** వాల్మీకి జయంతి సందర్భంగా గురువారం స్థానిక ఎన్ఎస్ఎస్ మున్సిపల్ హైస్కూల్లో ఆరో తరగతి విద్యార్థి తన్నీరు విష్ణువర్ధన్, మహాకవి వాల్మీకి, రామాయణంలోని కొన్ని ఘట్టాలకు సంబంధించిన చిత్రాలను చిత్రీకరించారు. రామాయణ గాథపై ఆసక్తి కలిగిన విష్ణువర్ధన్ పదోతరగతిలో గల 'రామాయణం' ఇతిహాసం పాఠ్యాంశంలోని చిత్రాలను చక్కగా చిత్రించాడు. రంగులు అద్ది ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులకు ప్రదర్శించాడు. రామాయణం అనేది గొప్ప వ్యక్తిత్వ వికాస గాథగా పాఠశాల చిత్రకళా ఉపాధ్యాయుడు బెల్లకొండ వెంకట్ అన్నారు. అలాంటి రామాయణాన్ని రచిస్తున్న మహాకవి వాల్మీకిని, రామాయణంలోని ఘట్టాలను చిన్నారి విష్ణువర్ధన్ చక్కగా చిత్రీకరించటాన్ని అభినందించారు. చిత్రలేఖనంలో మరింత పరిణతిని సాధించాలన్న భావనతో ఆ విద్యార్థికి పెయింట్లు, బ్రష్‌లు, ఇతర మెటీరియల్‌ను అందజేశారు.



రామాయణ ఘట్టం



మహాకవి వాల్మీకి

## సైబర్ నేరాలపై అవగాహన ఏర్పరచుకోవాలి

తెనాలి డీఎస్పీ జనార్ధనరావు

**అత్తోట(కొల్లిపర):** రోజు రోజుకు నూతన టెక్నాలజీతో ప్రపంచం ముందుకు పోతున్న సమయంలో దానికి అనుగుణంగా వివిధ సైబర్ నేరగాళ్లు కూడా పెరుగుతున్నారు అని ఇటువంటి సమయంలో ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండి నేరాలను అరికట్టాలని తెనాలి డీఎస్పీ బి.జనార్ధనరావు సూచించారు. జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ ఆదేశాల మేరకు మండలంలోని అత్తోట గ్రామంలో గురువారం రాత్రి వారధి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా తెనాలి డీస్పీ బి.జనార్ధనరావు , ట్రైనీ ఎస్పీ ఎం.ఎన్ భార్గవి, సీఐ బెల్లం శ్రీనివాసరావు పాల్గొని డ్వాక్రా మహిళలకు, రైతులకు సైబర్ నేరాలతో పాటు వివిధ నేరాల గురించి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ట్రైనీ ఎస్పీ ఎం.ఎన్ భార్గవి మాట్లాడుతూ మహిళలు బ్యాంకుల వద్ద నుంచి డబ్బులు తీసుకువెళ్లే సమయంలో బ్యాంకు ఆవరణలో ఉన్న అపరిచితులు పదేపదే వారిని చూస్తున్నా, వారిపట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని, వారు చెప్పే మాయ మాటలు నమ్మకుండా ఉండాలని, ఏమైనా అనుమానం వస్తే వెంటనే అక్కడ ఉన్న బ్యాంకు మేనేజర్ గాని దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌లో గాని సమాచారం అందించాలని సూచించారు.

సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ అపరిచితులు ఎవరైనా ఫోన్ చేసి మేము బ్యాంకు నుంచి , పలానా కంపెనీ నుంచి లేదా మీకు లాటరీ తగిలింది అని నమ్మపలికి మీ ఖాతాలో రూ.50 వేల నుంచి లక్ష వరకు డబ్బులు వస్తాయి అని నమ్మపలికి, మొత్తం మీ ఖాతాలో డబ్బులు జమ కావాలంటే ముందుగా మీరు మీము చెప్పిన ఖాతాకు నామాత్రం ఫీజు చెల్లించాలని చెప్పి తరువాత మీ దగ్గరి నుంచి మీ ఖాతా వివరాలు, ఓటీపీలు తెలుసుకుని మీ ఖాతాల్లో ఉన్న సొమ్ము మొత్తం వారి ఖాతాలో జమ చేసుకోవటం జరుగుతుందని ఇటువంటి సంఘటనలపై ప్రజలు అవగాహన కలిగి ఉండి ఇటువంటి సైబర్ నేరాలు జరగకుండా జాగ్రత్తగా ఉండాలని కోరారు. అనంతరం పోలీస్ వారు ప్రజలకు సైబర్ నేరాలు ఎన్ని రకాలు, వాటి ద్వారా నేరగాలు ఏ విధంగా మోసాలు చేస్తారు అన్న విషయాలను వీడియోలు ద్వారా ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పి.కోటేశ్వరరావు , ఎఎస్ఐ పోతురాజు, సిబ్బంది తాతరావు, కూర్మారావు, నాగబాబు, విజయ్, రైతులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



అత్తోటలో అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ జనార్ధనరావు

## రోడ్లపై పందులు వదిలితే చర్యలు తప్పవు

కమిషనర్ బండి శేషన్న

**తెనాలిఅర్బన్:** పందులను రోడ్లపై వదిలితే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న హెచ్చరించారు. పందుల పెంపకందారులతో మున్సిపల్ కార్యాలయలలోని కౌన్సిల్ హాల్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా వాటిని పెంచుకోవాలని సూచించారు. శివారు ప్రాంతాల్లో వాటిని ఉంచే విధంగా చూసుకోవాలన్నారు. ఫిర్యాదులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి, ఆరోగ్యాధికారి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ బండి శేషన్న

### ఉద్యాన పంటల్లో నీటిని బయటకు పంపాలి

**కొల్లిపర:** అధిక వర్షాలు వల్ల ఉద్యాన పంటలకు నష్టం జరగకుండా తీసుకోవాల్సిన చర్యలను తెనాలి ఉద్యాన విస్తరణ అధికారి పి.శ్రీధర్‌రెడ్డి గురువారం మండలంలోని పసుపు పంటలను పరిశీలించి రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పసుపు పంటలో చేరిన వర్షపు నీరు నిల్వ లేకుండా బయటకు పంపాలని, వారం వ్యవధిలో రెండు, మూడు సార్లు 0.5 పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు. అలాగే సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని 5 గ్రాములు లీటర్ నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. నేల ఆరిన తరువాత మొక్కలు బాగా పెరగడానికి ఎకరాకు 50 కిలోల వేప పిండి ఎరువులను వాడాలన్నారు. అలాగే అరటి, కూరగాయల తోటలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు గురించి రైతులకు వివరించారు.

## త్వరితగతిన ఇళ్లు నిర్మించుకోవాలి

ఎంపీడీవో ఎ. దీప్తి



**తెనాలిరూరల్:** మండల గ్రామాల్లో గృహ నిర్మాణ లబ్ధిదారులు తమ ఇళ్లను త్వరితగతిన నిర్మించుకోవాలని ఎంపీడీవో ఎ. దీప్తి కోరారు. గురువారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఇళ్లు మంజూరైన వాళ్లు నిర్మాణాలను ఇప్పటికీ ప్రారంభించకుండా ఆలస్యం చేస్తున్నారని చెప్పారు. కొత్త ప్రభుత్వంలో లబ్ధిదారులకు అదనంగా రూ. లక్ష ఇస్తారని ఎదురు చూస్తున్నారని, అటువంటి దేమీ జరగదని స్పష్టం చేశారు. గతంలో మంజూరైన రూ. 1.80 మాత్రమే లబ్ధిదారులకు అందుతాయని తెలిపారు. ప్రస్తుతం బిల్లులు త్వరితగతిన చెల్లింపులు జరుగు తున్నాయని, లబ్ధిదారులు వెంటనే పనులను ప్రారంభించుకోవాలని సూచించారు.

## బాణసంచా వ్యాపారులు నిబంధనలు పాటించాలి

**చెరుకుపల్లి:** బాణసంచా అమ్మే వ్యాపారులు నిబంధనలను పాటించాలని రేపల్లె డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. చెరుకుపల్లిలోని టపాకాయల గోడౌన్లను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. గోడౌన్లలో ముందస్తు జాగ్రత్త చర్యలుగా నీటితో నింపిన డ్రమ్ములను, ఇసుక బకెట్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. విద్యుత్ తీగలను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలని చెప్పారు. టపాకాయలు దాచే గోడౌన్లు గ్రామ శివారుల్లోనే ఉండాలని, గ్రామం మధ్యలో ఉండరాదని హెచ్చరించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రెండు గోడౌన్లను పరిశీలించారు. ఆయన వెంట ఎస్ఐ అనిల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



టపాకాయల గొడౌన్‌ను పరిశీలిస్తున్న రేపల్లె డీఎస్పీ శ్రీనివాసరావు

## గిరిజనులకు నిత్యావసరాలు పంపిణీ




**తెనాలి:** నిరాశ్రయులయిన కొలకలూరు గిరిజనులకు ట్రైబల్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం బియ్యం, కూరగాయలు,ఆహారం పొట్లాలను పంపిణీచేశారు. రూరల్ మండల గ్రామం కొలకలూరులో కొమ్మమూరు కాల్వ కట్టపై తాత్కాలిక గుడిసెల్లో నివసిస్తున్న గిరిజనులకు వర్షాలకు తక్షణసాయంగా నిత్యావసరాలను పంపిణీ చేసినట్టు ట్రస్ట్ చైర్మన్ రావూరి అంజలి తెలిపారు. కాల్వకట్టపైన గుడిసెలపై వేసుకున్న ప్లాస్టిక్ పరదాలు ఈదురుగాలులకు లేచిపోగా ప్రస్తుతం వంతెన కింద నిరాశ్రయులుగా జీవిస్తూ దయనీయంగా బతుకుతున్నారని అంజలి ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి నిరాశ్రయులను గుర్తించి వసతి సౌకర్యం కల్పించాల్సిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రావూరి సురేష్‌బాబు, ట్రస్ట్ వలంటీర్ షేక్ షబ్బీర్, బొంత కృపమ్మ పాల్గొన్నారు.

## సచివాలయాన్ని పరిశీలించిన తహసీల్దార్

**తెనాలిరూరల్:** వార్డు సచివాలయ ప్రాంగణంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్న స్థానికుల ఫిర్యాదుతో తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ గురువారం విచారణ చేశారు. స్థానిక చినరావూరు 13వ వార్డులోని 16వ సచివాలయంలో ఇటీవల స్లాబ్ సీలింగ్ కూలిన సంగతి తెలిసిందే. ఈ భవనం కింది హాలులో కల్యాణ మండపం ఉంది. గోడల ఎత్తు తక్కువగా ఉండటంతో రాత్రివేళ కొందరు యువకులు, అలాగే కల్యాణ మండపంలో శుభ, అశుభ కార్యక్రమాల సమయంలో హాజరైన కొందరు మద్యం సేవించడం వంటి కార్యకలాపాలు జరుగుతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. సచివాలయ సిబ్బందితోపాటు స్థానికులతో తహసీల్దార్ చర్చించారు. అనంతరం ఈ ప్రాంగణంలో నైట్ వాచ్‌మెన్‌ను కేటాయించాలని మున్సిపల్ కమిషనర్‌ను కోరామని, పట్టణ వన్ టౌన్ సీఐతో మాట్లాడి రాత్రివేళ పోలీస్ బీట్ నిర్వహించాలని, బీట్ బుక్ కూడా నిర్వహించాలని కోరినట్లు తహసీల్దార్ వెల్లడించారు.



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

### చోరీ కేసులో నిందితుడి అరెస్టు

**చందోలు(కర్లపాలెం):** చోరీ కేసులో నిందితుడిని అదుపులోకి తీసుకుని చోరీకి గురైన సొత్తును రికవరీ చేశామని చందోలు ఎస్ఐ శ్రీనివాస్ గురువారం తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. 2023 నవంబర్‌లో పిట్టలవానిపాలెం గ్రామానికి చెందిన కల్లేపల్లి శ్రీనివాసరావు బంధువుల ఇంట్లో చోరీ జరిగింది. శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి పోలీసులు పొన్నూరు పట్టణానికి చెందిన షేక్ కరిముల్లా చోరీ చేసినట్లు గుర్తించారు.